# చేతులుంటే ఎంత బావుణ్ణు!

మీరు నమ్మరేమో కానీ . . . నేను పుట్టడం నాకు గుర్తుంది.

ఆ రోజు నేనెంత సంబరపడ్డానో మీ మాటల్లో చెప్పలేను. కొత్త బాడీ - కొత్త టైర్లు - అనవరతం పని చేసే గుండెలా నాకమర్చిన ఇంజన్ - కళ్ళు చెదిరే రంగులు - ఓహ్ . . . తలారా షాంపూతో స్నానంచేసి, ఖరీదైన పట్టు చీర కట్టుకుని, కురుల్లో మల్లెపూలు తురుముకుని, వయ్యారంగా నడచివచ్చే కన్నెపిల్లలా నేను సర్వాంగసుందరంగా ముస్తాబై కార్ఖానా నుండి బైటికి వచ్చాను. చెప్పొద్దూ - నన్ను చూస్తే నాకే ముద్దొచ్చేంత అందంగా ఉన్నాను.

నన్ను నడపటానికి మొట్టమొదటి సారి డ్రైవర్ తన సీట్లో కూర్చున్నప్పుడు నాకు బోల్డంత సిగ్గేసింది. సిగ్గుతోపాటు చెప్పలేనంత భయం కూడానూ . . .

చార్మినార్ నుండి సికింద్రాబాద్ వెళ్ళే రూటు నాది. చార్మినార్‌ని చూసినపుడు ఎంత ముచ్చటేసిందో - అద్భుతమైన కట్టడం! రెండు కళ్ళు చాల్లేదనుకోండి . . . ఎటొచ్చీ ఆ ఇరుకు గల్లీలూ - దుమ్మూ, ధూళీ - అగ్గిపెట్టెల్లా అంధకారంతో నిండిన యిళ్ళూ - పేదరికం . . . నా కళ్ళు చెమర్చేవి.

గమ్యస్థానం చేరుకోటానికి ఎక్కే హిందువులూ . . . ముస్లింలూ - క్రిస్టియన్లూ . . . నాకివేవీ పట్టేవి కావు. వారి పాదాల స్పర్శకే నా తనువు పులకించి పోయేది. పసిపిల్లలు తమ బుల్లిబుల్లి పాదాల్తో నా గుండెలమీద తొక్కుతున్నంత తీయటి అనుభూతి . . . కోడిపెట్ట తన పిల్లల్ని రెక్కలకింద భద్రంగా దాచుకున్నట్లు వీళ్ళందర్నీ పొదవి నా కడుపులో దాచుకునేదాన్ని.

నన్నందుకోవాలని పరుగెత్తే పిల్లల్ని చూసినపుడల్లా చప్పున ఆగి, వారినెత్తుకుని ఒళ్ళో కూచోబెట్టుకోవాలనిపించేది. ఆపకుండా నన్ను పరుగెత్తిస్తున్న డ్రైవర్‌మీద బోల్డంత కోపం వచ్చేది. అయ్యో - పిల్లలు . . . పడ్తారేమోననే దిగులుతో గుండె నీరైపోయింది.

ఎంత అన్యాయమో చూశారా . . . నాలుగు కాళ్ళైతే అమర్చారు కానీ ఒక్క చేయైనా లేదే . . . బాబూ . . . జాగ్రత్త . . . పడ్తావు అని అరిచినా వాళ్ళకు విన్పిస్తేగా - విన్పించినా వింటారా పాడా - వాళ్ళకదో సరదా . . . వీరత్వం . . . నిలబడిన బస్ ఎక్కితే నామోషీ

కాదూ–నా భయాలు వాళ్ళకేం తెలుస్తాయి? ఏ ఆడదాని మనసైనా సాటిమనిషి, ఆడదైనా మగైనా, ఎపుడైనా అర్థం చేసుకున్నారు గనకనా!

అదుగో – ఇప్పుడేకదూ చెప్పాను – అటు చూడండి . . . ఆ కుర్రవాడు నాతో పాటు ఎలా పరుగెత్తుతున్నాడో – ఎర్రగా . . . సన్నగా . . . నాజూగ్గా . . . ఆ జుట్టే – జులపాలు పెంచాడు. ఎటొచ్చీ జుట్టుకు రబ్బరు బ్యాండ్ పెట్టుకోలేదు – గుడ్డిలో మెల్ల. అయ్యో . . . పడ్డావు . . . నాకు స్లో కావాలనే ఉంది – పాన్ నములుతూ, కండక్టర్‌తో బాతాఖాని కొడ్తున్న డ్రైవరే ఆ బాబుని పట్టించుకోవటం లేదు. దగ్గరకొచ్చేశాడులెండి . . . ఎంత బాగా పరుగెత్తుతున్నాడో . . . ప్చ్ . . . అయినా ఆసియాడ్‌లో ఒక్క గోల్డ్‌మెడల్ కూడా రాదెందుకో? హమ్మయ్య . . . నన్ను అందుకున్నాడు. చేతుల్లేకున్నా నా శరీరాన్ని కొద్దిగా ఒంచి అతన్ని పొదవుకున్నాను . . . మీకు కన్పడదులెండి . . . మరేం చేయను? నాకు వీళ్ళంటే వల్లమాలిన ప్రేమ.

అవునూ – ఎందుకతను ముందుకు జరుగుతున్నాడు? వెనక చాలా స్థలం ఉందిగా – వెళ్ళి ఓ అమ్మాయి వెనక నిలబడ్డాడు. కుదుపొచ్చినపుడల్లా కావాలని ఆ అమ్మాయిమీదికి ఒరుగుతున్నాడు. ఆమెను చూసి వెకిలిగా నవ్వుతున్నాడు. ఇలాంటివే నాకసహ్యం – అయ్యో నాకు చేతులుంటే ఈ పిల్లల్ని క్షేమంగా దగ్గరకు తీసుకునేదాన్ని కదా అని ఎలా బాధ పడ్డానో . . . ఇలాంటి జులాయి వెధవల్ని చూసినపుడు, నాకే చేతులుంటేనా ఆ చెంపా ఈ చెంపా వాయించేదాన్ని కదా అని కూడా బాధ పడ్డాను. తప్పు వీళ్ళది కాదు. వీళ్ళు మైనం బొమ్మల్లాంటివారు. మనం ఎలా మలిస్తే అలా మారతారు. తప్పు వీళ్ళనికన్న తల్లిదండ్రులది. తమ కూతుళ్ళను మగపిల్లలు అల్లరిచేస్తే బాధపడి, కోపపడి, అసహ్యపడి, ఆవేశపడిపోయే తల్లులు – తమ కొడుకుల్ని ఎందుకు మందలించరు? పరాయి స్త్రీలతో ఎలా ప్రవర్తించాలో ఎందుకు నేర్పరూ–మీకే నా భాష అర్థమయ్యేట్టుంటే నేను మోసే ప్రతి ఆడదానికీ అర్థమయ్యేలా చెప్పేదాన్ని . . . మీ కొడుకులకు మర్యాదా మన్ననా నేర్పండని.

చూస్తూ చూస్తూనే ఆర్నెల్లు గడిచిపోయాయి. దసరా శెలవలు . . . స్కూళ్ళకెళ్ళే చిన్నారులకు ఆటవిడుపు – అలవాటుపడిన ఆ పాదముద్రల పరిష్వంగం కోసం నా శరీరం పరితపించేది.

విజయదశమి రోజు నన్ను బాగా అలంకరించారు. అరటికొమ్మలు కట్టారు. బంతిపూల మాలలతో నన్ను ముంచెత్తారు. నా మొహం మీద పసుపు కుంకుమల్ని అద్దారు. దసరా శుభాకాంక్షలు అంటూ చమ్కీలద్దిన అక్షరాలతో నేను మెరిసిపోయాను. పట్టలేని సంతోషంతో మురిసిపోయాను. చార్మినార్ నన్ను చూసి కళ్ళింతవి చేసుకున్నట్టు గుర్తు. అబిడ్స్ కూడలి నా

అందం చూసి నోరు వెళ్ళబెట్టినట్టు కూడా గుర్తు. నాక్కనిపించిన ప్రతి వ్యక్తినేకాదు . . . ప్రతి చెట్టునీ, ప్రతి పుట్టనీ పల్కరించాలన్నంత సంబరం నాలో.

జీవితం ఎంత బావుందీ! ఎంత మధురంగా ఉందీ! నా బ్రతుక్కి ఓ సార్థకత చేకూరింది. అనునిత్యం ప్రజల్ని ఓ స్థలం నుంచి మరో స్థలం దాకా ప్రేమగా మోసుకెళ్ళిదింపటం . . . ఎంత తృప్తిగా ఉంటుందో! ఆకాశంలో ఎగిరే విహంగంలా ఆనందంగా, హాయిగా, సంతోషంగా . . . నా బ్రతుకును చూస్తే నాకే ఈర్ష్యపుట్టింది.

దసరా వెళ్ళిన పక్షం రోజులకనుకుంటాను–గాలిలో ఏదో మార్పు . . . అంతా హష్ హష్‌లా . . . రహస్యం రాజ్యమేలుతున్నట్లు . . . భయం విస్తరిస్తోన్న వాసన . . . స్కూలు పిల్లలెవరూ రాలేదు. ఎప్పుడూ నిండు గర్భిణిలా ఉండే నేను ఒకరిద్దరితో అసంతృప్తి పడ్డాను. ఆ రోజు ఆదివారం కూడా కాదు. చార్మినార్‌కి ఇరువైపులా ఉండే దుకాణాలు పదకొండైనా తెరవలేదు. కారణం తెలియక కంగారుపడుతూ ఒళ్లంతా చెవులు చేసుకుని విన్నాను . . . కండక్టర్ అప్పారావుకి నా ఆరాటం అర్థమైందనుకుంటాను – డ్రైవర్ మునీర్‌ఖాన్‌తో చెప్తుండగా విన్నాను.

“నిన్న రాత్రి లోకల్ రౌడీ షీటర్ రాజూ పహిల్వాన్‌ని ఎవరో దారుణంగా పొడిచి చంపారట – అందుకు బంద్ చేస్తున్నారు” అన్నాడు అప్పారావు.

“గిదేంది భాయ్ సమఝ్‌మే ఆతా లేదు . . . గీ బద్మాష్‌గాణ్ణి ఖతం చేస్తే బంద్ ఎందుకు చేస్తుండ్రు . . . ఖుషీ చేస్కోవాలి గానీ” అన్నాడు ఖాన్.

నాకు మనసంతా దేవినట్లయింది. రాజూ పహిల్వాన్ నాకూ తెల్సు. అతను పచ్చి నెత్తురు తాగే కసాయి అని అందరూ చెప్పుకోగా వినటం వల్లనుకుంటాను – అతను ఎక్కిన ప్రతిసారీ నా శరీరం భయంతో వణకటం నాకు గుర్తుంది. మనిషి కూడా అలానే ఉండేవాడు – ఎర్రటి కళ్ళు . . . మెలితిరిగిన గుబురు మీసాలు . . . కండలు తిరిగిన శరీరం . . . ఆరడుగుల విగ్రహం. అతన్ని చూస్తే చాలు, మిగతా ప్రయాణీకులు బితుకుబితుకుమంటూ పక్కకు ఒదిగేవారు. ప్రాణాలు అరచేత పట్టుకుని కూచునేవారు. నాకైతే ఏ అఘాయిత్యం జరిగిపోతుందోనని భయంతో టైర్లు వణికేవి.

వాడు ఆరు మర్డర్లు చేశాడట. వీడికో పార్టీ మద్దతు . . . వీడో ప్రజా నాయకుడైనట్లు. వీడు చస్తే, నరకాసురుణ్ణి వధించాక దీపావళి చేసుకున్నట్లు సంబరం చేసుకోవాలి కానీ బంద్ ఏమిటి? విడ్డూరం కదూ! జాతి జవసత్వాలు ఉడిగిపోయినట్లు ఎందుకయిందో . . . ప్రజలు నిర్వీర్యుల్లా, నిర్జీవుల్లా ఇలాంటివి ఎందుకు సహించి, భరిస్తున్నారో . . . వాడెవడో లోఫర్‌గాడు

చచ్చిపోతే షాపులు ముయ్యాలా? పిల్లలు స్కూళ్ళు మానేయాలా? ఇలా శాసించేది ఆ రౌడీగాడి తొత్తుమూకలా . . . దానికి ఓ రాజకీయ పార్టీ అండదండలా . . . వీళ్ళకు సిగ్గెందుకు వేయదో . . . చనిపోయిన వ్యక్తిమీది గౌరవంతో మనస్ఫూర్తిగానో, చంపినవారి మీద నిరసనతోనో వాళ్ళకు వాళ్ళు బంద్ చేసుకుంటే సబబేకానీ – ఇలా ముష్కరమూకలు కత్తులూ, కర్రల్తో బెదిరించి బలవంతంగా బంద్ చేయిస్తుంటే – వీళ్ళందరూ ప్రజాస్వామ్యంలో ఉంటూ కూడా తమ నోళ్ళను ఎందుకు బంద్ చేసుకున్నారో?

ఆలోచనల్లో నేను గమనించనే లేదు – నా ఎదురుగ్గా పదిమంది రౌడీలు నిలబడి ఉన్నారు.

"కౌన్‌రే బద్మాష్ గాడీమే? ఉతర్ . . . జల్దీ ఉతర్" అని అరుస్తూ కర్రల్తో గొర్రెల్ని అదిలించినట్లు అదిలిస్తున్నారు. డ్రైవర్, కండక్టర్, ఉన్న ఓ అరడజను ప్రయాణీకులూ దిగిపోయారు. ఒక్కరైనా ఎదిరించరేం . . . ఎందుకని ప్రశ్నించరేం . . .

చెంప ఛెళ్ళుమన్నట్లు – ఓ రాయి బలంగా తాకింది. పక్క కిటికీ అద్దాలు భళ్ళుమన్నాయి. నేను నొప్పితో, అవమానంతో భగ్గుమన్నాను. ఆ బాధనుంచి తేరుకోకముందే మరో రాయి నా ముందు అద్దాన్ని తాకింది. ఆ అద్దం నా గుండెని గాయం చేస్తూ వేయి ముక్కలైపోయింది.

నా తప్పేమీ లేకుండానే నన్ను శిక్షిస్తున్నారు – నన్ను అన్యాయంగా గాయపరుస్తున్నారు – రాళ్ళు . . . విసురుగా తాకుతూ రాళ్ళు . . . నా వళ్ళు రక్తసిక్తమైపోతోంది. నా మనసులో అనుకున్న మాటలు వీళ్ళకు అర్థమయ్యాయా? తప్పును తప్పు అని చెప్పటం కూడా తప్పేనా . . . నా భావాల్ని వెల్లడించే ప్రాథమిక హక్కు కూడా నాకు లేదా . . . ఇంతటి దౌర్జన్యం ఎలా సహించాలో నాకర్థం కావడం లేదు.

నన్ను రక్షించటానికి ప్రజలెవ్వరూ రాలేదు . . . ప్రజానాయకులూ రాలేదు . . . మేం మీస్నేహితులం అంటూ పెద్ద పెద్ద అక్షరాల్లో రాసుకునే పోలీసులూ రాలేదు.

గాయపడిన శరీరమూ, మనసుతో మొదటిసారిగా నేను మా హాస్పిటల్‌కెళ్ళాను. ఇక్కడ శరీరాల్ని రిపేరు చేస్తారు కానీ నా మనసు మాటేమిటి?

మా హాస్పిటల్ మీ హాస్పిటల్స్‌లా కాదులెండి – అదృష్టం – మీకుమల్లే మందులు మింగించి వేరే రోగంతో చంపరు. నాకు కొత్త అద్దాలు బిగించారు. సొట్టలు సరిచేశారు – కొత్త రంగులు అద్దారు.

ఓ పది రోజుల తర్వాత నేను నవనవలాడే యవ్వనవతిలా ముస్తాబై – నా పనిలో మునిగిపోయాను. ఎట్లా అయినా ఒరిజినల్ ఒరిజినలే . . . అతుకులు అతుకులే. నా నడకలో ఒకప్పటి హొయలూ, హుందాతనం తగ్గినట్లు నాకు తెలుస్తూనే ఉంది. మనసుకూడా ఒకప్పటిలా

జలపాతంలా ఉరకలెయ్యటం లేదు - మెరుపులా ఒయ్యారపు విరుపుల్తో మురిసిపోవటం లేదు.

అయినా నాకిష్టమైన ప్రజాసేవలో పడి నా బాధని మర్చిపోయాను. ప్రజాసేవ అనే మాట వాడితే దగుల్బాజీ నాయకులు గుర్తుకు రాలేదా మీకు? ఆ మాటకు అర్థమే పెడర్థమైపోయిన దుస్థితిలో ఉన్నాం కదూ మనం.

నాయకులంటే గుర్తొచ్చింది - వినాయక చవితి ఇంకో వారమే ఉంది.

భాగ్యనగరంలో వీధివీధిన రకరకాల మంటపాలు - అందులో వివిధ భంగిమల్లో కొలువుతీరిన నిలువెత్తు బొజ్జగణపయ్య విగ్రహాలు - సంబరం . . . సందడి . . . గాలిలో తేలియాడుతూ వచ్చే పండగ వాసన...

ఇలాంటి వాతావరణం ఎంతటి సంతోషాన్నిస్తుందో - నా పిల్లలు ఆనందంగా ఉంటే నాకూ ఆనందం కదూ.

పది రోజులు పది సెకన్లలా గడిచిపోయాయంటే నమ్మండి. విగ్రహాల్ని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేస్తారట . . . ఒకటే హడావిడి . . . డప్పుల మోత . . . ట్రాలీల్లో, లారీల్లో విగ్రహాలు . . . జనసందోహం . . . ఒక్కో వాహనంతో పాటు నడుస్తూ పోలీసులు . . . ఎక్కడపడితే అక్కడ ట్రాఫిక్ ఆగిపోతోంది. నేనుకూడా మెల్లగా కదుల్తున్నా.

అకస్మాత్తుగా అలజడి . . . ఆందోళన . . . రోడ్డుమీద హాహాకారాలు చేస్తూ ప్రజలు పరుగెత్తుతున్నారు. పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ తరుముతున్నారు.

డ్రైవర్ ఖాన్‌కి ముందుకెళ్ళాలో, వెనక్కితిప్పాలో తెలీని సందిగ్ధం . . .

వాళ్ళ మాటల్ని బట్టి నాకర్థమైనదేమంటే ఓ మసీదు ముందునుండి వూరేగింపు వెళ్తున్నప్పుడు డప్పులు వాయించకూడదని అభ్యంతరపెట్టారట. కాని వూరేగింపులోని జనం విన్లేదట. వాళ్ళకు కోపంవచ్చి రాళ్ళు రువ్వారట.

అయ్యో . . . ఇది మతోన్మాదం కాదు బాబులూ . . . మూర్ఖత్వం. నా బిడ్డల్లో చదువుకున్నవాళ్ళెంత శాతం? అంతా పామర జనం . . . వాళ్ళను క్షమించండి. తప్పుచేయటం మానవ సహజం . . . క్షమించటం దైవలక్షణం . . . పసితనం అని వదిలేయండి . . . ఆకలితో అల్లాడేవాళ్ళకు మతంకోసం పోరాడే తీరికెక్కడిది? ఇందులో స్వార్థ రాజకీయం ఉందేమో ఆలోచించండి . . .

నా ఆలోచనల్లో మునిగిపోయి చూడనేలేదు - నా చుట్టూతా పదిమంది తల్వార్‌లు పట్టుకుని నిలబడి ఉన్నారు. వాళ్ళు ముస్లింలో, హిందువులో నాకు తెలియటం లేదు. అప్పటికే డ్రైవర్,

కండక్టర్ దిగి తలో దిక్కుకీ పారిపోతున్నారు. హాహాకారాలు . . . ప్రాణభయంతో పరుగెత్తుతున్న ప్రజలూ . . . పిల్లలూ . . . నా ఖర్మానికి నన్ను వదిలేసిన ముసలితల్లిలా నేను . . .

ఏదో తడి . . . ఘాటు వాసన . . . పెట్రోల్ వాసన . . . నన్ను తడిపేస్తున్నారు . . . ముద్దలా . . . వూపిరాడకుండా . . . అయ్యో, తండ్రీ . . . ఎందుకిలా చేస్తున్నారు? నేను మీకేం నష్టం చేశాననీ . . . ఏ మతాన్నీ పల్లెత్తు మాట అనలేదే . . . మీకూ నాకూ ఎలాంటి శత్రుత్వమూ లేదే . . . నేను అజాత శత్రువుని . . . మిమ్మల్ని జీవితాంతం మోస్తూ బ్రతుకీడుస్తున్నదాన్ని . . . నడిస్తే మీ పాదాలు ఎక్కడ కందిపోతాయోనని తల్లడిల్లే పిచ్చి తల్లిని . . .

ఎవరో అగ్గిపుల్ల గీశారు. అతన్ని భయంతో కళ్ళు విప్పార్చి చూశాను. మొహంనిండా స్ఫోటకపు మచ్చలు . . . ఎర్రటి తాగిన కళ్ళు . . . నాకు గుర్తే . . . అతన్ని ఎన్నిసార్లు నా ఒడిలోకి లాక్కున్నానో. నా బిడ్డలు దుర్మార్గులైతే బాధ పడ్డాను కానీ మోయనని ఎపుడైనా మొండికేశానా? నేను మీ మేలుకోరేదాన్ని బాబూ . . . మీకోసం ఉన్నదాన్ని . . . మీ దాన్ని . . . అయ్యా బాబూ . . . నన్ను కాల్చకండి. భగ్గున మంట. నా వళ్ళంతా కారం రాసినట్లు . . . నా శరీరం కాలుతున్న వాసన . . . నేను దగ్ధమౌతూ వాళ్ళందరి మొహాలవైపు చూశాను. ఎర్రటి సంతృప్తి వాళ్ళలో . . . క్రూరమైన ఆనందం . . . వీళ్ళనేకదూ నేను ప్రేమగా అక్కున చేర్చుకుంది! నాకే చేతులుంటే ఎంత బావుణ్ణు . . . ఒక్కొక్కణ్ణి ఎత్తి మూసీలోకి విసిరేసి ఉండేదాన్ని.

******

నెలరోజులు షెడ్‌లో గడిపాను. నాలోని చాలా భాగాలు కొత్తవి వేశారు. నాకు పిల్లలు గుర్తొస్తున్నారు. పిచ్చి మనసు కదూ నాది. ఎపుడెపుడు బైటపడి మరలా వారి పాదాల స్పర్శని కౌగిలించుకుంటానా అన్న ఆతురత. ఏం చేయను . . . తల్లి మనసు . . . తిండి పెట్టకుండా మాడుస్తున్నా . . . కాళ్ళతో కొట్టినా . . . మాటల్తో హింసించినా . . . సంతానంపైన మమకారం చంపుకోలేని వెర్రి మనసు.

మరలా నేను నా పిల్లల్ని మోసే పనిలో బిజీ అయ్యాను.

నాకిప్పుడు రాళ్ళదెబ్బలు తినటం అలవాటైపోయింది. కిరోసిన్ వాసన అలవాటైంది. చీటికి మాటికి తగలబడిపోవటం కూడా అలవాటైంది. స్ట్రైకులు చేస్తే నేనే బలిపశువుని . . . బంద్‌లు జరిగితే నేనే వధ్యశిల మీద నిలబడిన వింతజీవిని . . . స్టూడెంట్స్‌కి సమస్య లొస్తే . . . నాకు రాళ్ళదెబ్బలు తప్పనిసరి. ఉద్యోగస్థుల కోరికలు తీరాలన్నా నా అద్దాలు

భళ్ళుమనాల్సిందే. ఏ పార్టీ తారతమ్యం లేకుండా ప్రభుత్వం మీద కసంతా నా మీదే తీర్చుకుంటారు.

నా మెటాలిక్ బుర్రకి ఇందులోని లాజిక్ ఎంత ఆలోచించినా అర్థం కాదు. నన్ను హింసిస్తే వీళ్ళకేం వస్తుంది? నన్ను కాలిస్తే వీళ్ళకేగా నష్టం. ఇంత చిన్న విషయాన్ని తెల్సుకోలేనంత మూర్ఖులా మనుషులు!

ఓసారి మాసిన గడ్డంతో, మెరుస్తున్న కళ్ళతో, విప్లవం నరాల్లో ప్రవహిస్తున్నట్లున్న కుర్రాడొకడు ఎక్కాడు. అతనిచేతిలో మాక్జింగోర్కీ రాసిన అమ్మ, శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం పుస్తకాలున్నాయి. అతని మాటల్లో ఆవేశం ఉంది – అతని వూహల్లో స్వర్గంలా భాసించే మరో ప్రపంచం ఉంది. అతను చెప్తుండగా మొట్టమొదటిసారిగా అన్నల గురించి విన్నాను.

అన్నలు అడవుల్లో ఉంటారట. నిరుపేదలకు అండగా, దోపిడీదారులకు సింహస్వప్నంలా, పేదా ధనిక భేదమేలేని సమసమాజ స్థాపన ధ్యేయంగా పోరాటం చేస్తున్నారట.

వాళ్ళను తల్చుకుని నా హృదయం వాత్సల్యంతో నిండిపోయింది. పేద, బడుగు వర్గాలకోసం ఎండనక, వాననక శ్రమిస్తున్న ఆ యువకుల్ని ఒక్కసారైనా కళ్ళారా చూడాలని మనసు ఉవ్విళ్ళూరేది. ఓ రోజు నా కోరిక తీరింది. నా ఎదురుగా నిలబడిన నలుగురు యువకులు అన్నలేనట. నాకైతే ఎంత సంతోషం వేసిందో – నాకే చేతులుంటే వాళ్ళను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఉండేదాన్ని కదా అని బాధ పడ్తూ ఓ క్షణం కళ్ళుమూసి తెరిచేప్పటికి వాళ్ళచేతుల్లో పెట్రోల్ డబ్బా ప్రత్యక్షమైంది. నేను భయంతో బిగుసుకుపోయాను. చివరి కత్తి పోటు తిన్న సీజర్ "యూ టూ బ్రూటస్"అన్నాడట – ఎవరో స్టూడెంట్ చెప్తుండగా విన్నాను. నా పరిస్థితీ అలానే ఉంది. బాబూ – మీరు ఏ వర్గం కోసం శ్రమిస్తున్నారో వాళ్ళ సేవకోసం ఉన్నదాన్ని. స్వంతవాహనాల మీద తిరగలేని పేద, మధ్య తరగతి ప్రజల్ని ప్రేమతో మోస్తున్నదాన్ని. నన్నెందుకు తగలబెడ్తున్నారో నాకర్థంకావడంలేదు తండ్రీ . . . మీ పోరాటం ప్రభుత్వం మీదనా? అమాయక ప్రజలమీదనా? నా మీదయ్యే ఖర్చంతా ప్రజలనెత్తిన రుద్దబడుతుందన్న విషయం మేధావులైన మీకు తెలియదా? అగ్గిపుల్ల నా మీద పడి భగ్గుమన్నా – వీళ్ళ చర్య నా గుండెను మండించినదానికన్నా ఎక్కువ బాధ పెట్టలేకపోయింది.

******

రాగద్వేషాలకు అతీతమైన విరాగినిలా నేను – నాకు ముసలితనం వచ్చేసిన భావన – నిర్వేదం – నిర్వికార భావం – అకారణంగా కాలిపోవటం నా జీవితంలో విడదీయరాని భాగమైపోయింది. మా హాస్పిటల్‌కి నేను రెగ్యులర్ పేషెంట్‌ని.

ఈ మధ్యన నాకు చేతులు లేవే అన్న దిగులు బాధించటం లేదు. ఎవ్వరిపాదాల స్పర్శకోసం నేను ఎదురుచూడటం లేదు. ఎవర్ని చూసినా భయం వేయటం లేదు. నేనో నిజమైన యంత్రంలా మారిపోయాను.

ఓ రోజు ఇద్దరు యువకులు కత్తుల్తో బెదిరించి నన్ను ఆపారు. భావరహితంగా నేను ఆగిపోయాను. వాళ్ళు ప్రయాణీకుల్ని దోచుకుంటారనుకున్నాను. అలా జరగలేదు. వాళ్ళందర్నీ దింపేసి ఎప్పటికిమల్లే నన్ను తగలబెట్తారని సిద్ధపడ్డాను. అలానూ జరగలేదు. నాలో రాగద్వేషాలు లేవని చెప్పాను కదూ - పొరపాటు, నాకు స్పందించే హృదయం ఉంది - కలత చెందే మనసుంది - అయ్యో . . . మీరిద్దరూ ఏం చేస్తున్నారు? మనుషుల్ని లోపలే ఉంచి, నన్ను పెట్రోల్‌లో ముంచెత్తారు. తలుపు దగ్గరా పెట్రోలు పోశారు. ఎవ్వరూ బైటకు రావడానికి అవకాశం లేకుండా కత్తులు పట్టుకుని ద్వారం దగ్గరే నిలబడ్డారు. ఇది అన్యాయం . . . అమానుషం . . . మీరీపని ఎందుకు చేస్తున్నారో నాకు తెలియదు . . . మీ సిద్ధాంతాలేమిటో తెలియదు. ఏమైనా సరే మీ సాటిమనుషుల్ని ఇలా సజీవంగా దహనం చేయటం రాక్షసత్వం. అయ్యా, బాబూ . . . కావాలంటే నన్ను కాల్చుకోండి. దీపావళి రోజు బాణాసంచా కాల్చినట్లు నన్ను కాల్చి సంబరపడండి. ఈ అమాయకుల్ని మాత్రం వదిలేయండి. వీళ్ళ ప్రాణాలు పోతే మరలా తిరిగిరావన్న విషయం మీకు తెలియదా? వీళ్ళ సంసారాల్ని గురించి ఓ క్షణం ఆలోచించండి. ఇంటిదగ్గర ఎదురుచూస్తున్న పెళ్ళాం పిల్లల గురించి ఆలోచించండి. మంటలు . . . మంటలు . . . శలభాల్లా మాడిపోతూ ప్రయాణీకులు . . . ఆర్త నాదాలు . . . చావుకేకలు . . . నాకు చేతులుంటే ఎంత బావుణ్ణు . . . వీళ్ళను భద్రంగా ఎత్తి కిందకు దింపి, నేను తృప్తిగా కాలిపోయి ఉండేదాన్ని. జీవితంలో ఎన్నడూ వూహించని విషాదంలో మండిపోతూ నేను . . .

*(కథామహల్ - దువ్వూరి శారదాంబ పోటీ కథా సంకలనం, అక్టోబర్ 1999)*